సాక్షి
బాపట్ల
శనివారం । 14 । డిసెంబర్ । 2024



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.



వైభవంగా కృత్తికా దీపోత్సవం

రేపల్లె రూరల్: మార్గశిర మాసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లిలోని చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివలింగాకృతిలో దీపాలను భక్తులు వెలిగించారు.

భక్తితో హనుమద్ వ్రతం



మంగళగిరి: నగర పరిధిలోని హనుమంతుడి ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. హనుమద్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



నరసరావుపేట:ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఆ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం నుంచి నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో శుక్రవారం పోస్టర్ విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలు వాడటం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. అవసరంలేని సమయంలో లైట్లు స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్స్ పెట్టుకోవాలని చెప్పారు. విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ కోరారు. విద్యుత్‌శాఖ పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీరు పి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబొట్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి రిమాండ్

సస్పెండ్ చేసిన విద్యాశాఖాధికారులు

కొల్లూరు: విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి తెనాలి కోర్టు రిమాండ్ విధించినట్లు కొల్లూరు ఎస్‌ఐ జి.ఏడుకొండలు తెలిపారు. మండలంలోని కిష్కింధపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిల పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయుడు వల్లభనేని వెంకటేశ్వరరావు జుగుప్సాకరంగా వ్యవహరించిన విషయం విదితమే. విద్యార్థినిలను లైంగిక వేధింపులకు గురిచేస్తుండటంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఈనెల 10న పాఠశాలలో ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు విచారణ చేపట్టి కీచక ఉపాధ్యాయుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేపట్టి దర్యాప్తు జరిపారు. ఉపాధ్యాయుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి శుక్రవారం తెనాలి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో రేపల్లె సబ్ జైల్‌కు తరలించారు. మండల విద్యాశాఖాధికారుల నివేదిక ఆధారంగా శుక్రవారం అతనిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు కొల్లూరు ఎంఈఓ-2 సౌభాగ్యజ్యోతి తెలిపారు.

వెల్లటూరు ఛానల్‌కు సాగు నీరు విడుదల



భట్టిప్రోలు: వెల్లటూరు ఛానల్ పరిధిలో భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై కూలిన చప్టాకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి దిగువకు సాగు నీరు విడుదల చేశారు. సుమారు వందేళ్ల పైబడి బ్రిటీష్ కాలం నాటి చప్టా గత నెల 25వ తేదీన కూలిన విషయం పాఠకులకు విదితమే. ప్రస్తుతం దిగువకు ఒక తడి సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ శాఖాధికారులు చర్యలు చేపట్టారు. వారం పది రోజుల్లోగా తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి దిగువ ప్రాంతాలైన నగరం, నిజాంపట్నం మండలాల్లోని పంట పొలాల్లోని సాగుకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఛానల్ పరిధిలో భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. దిగువ మండలాల్లో సుమారు 15 వేల ఎకరాలకుపైగా పైరు లేత దశలో ఉంది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం చప్టా ద్వారా సాగునీటి విడుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ సువర్చల శుక్రవారం తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్మన్ ఎన్.సత్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్, చెల్లని చెక్కు, బ్యాంక్, రెవెన్యూ, మోటార్ వాహన ప్రమాదాలు, మనోవర్తి, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు రాజీ చేసుకున్నట్లయితే కోర్టు ఫీజు వాపస్ ఉంటుందని తెలిపారు.

కదం తొక్కిన రైతన్నలు

కర్షకులను నట్టేట ముంచిన కూటమి సర్కారు

మద్దతు ధర కోరుతూ అన్నదాతల ఆందోళన

మేము అధికారంలోకి వస్తే రైతన్నలకు అండగా ఉంటాం...రైతుల అభ్యున్నతే మా ధ్యేయం ఏడాదికి రూ.20 వేలు చెల్లిస్తాం. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం అంటూ ఎన్నికలకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతలను విస్మరించారు. పండించిన పంటలకు కూడా గిట్టుబాటు ధర లేక అయినకాడికి అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లిన రైతులకు నిబంధనల పేరుతో చుక్కలు చూపిస్తున్నారు. చివరకు అన్నదాతల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారు. అయినా ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వ తీరుకు నిరసనగా రైతులు శుక్రవారం రోడ్డెక్కారు. కలెక్టరేట్ వద్ద కదం తొక్కారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, రైతులు వేలాదిగా తరలివచ్చారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన మేరుగ నాగార్జున, కోన రఘుపతి, పానెం చిన హనిమిరెడ్డి, వరికూటి అశోక్‌బాబు, రైతులు

- తరలివచ్చిన రైతులు
- అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ
- కిక్కిరిసిన కలెక్టరేట్ రహదారులు
- గంటకు పైగా కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన పార్టీ నాయకులు, రైతులు
- అడుగడుగునా అవాంతరాలు సృష్టించిన పోలీసులు
- జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

బాపట్ల/బాపట్లటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీశ్రేణులు, రైతులు తొలుత పట్టణంలోని రథం బజార్ సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడినుంచి ర్యాలీగా గడియార స్తంభం, జీబీసీ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, చీలురోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. 'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి, దళారుల వ్యవస్థ నశించాలి అంటూ రైతులు చేసిన నినాదాలతో బాపట్ల హోరెత్తింది. వేలాదిగా తరలివచ్చిన నాయకులు, రైతులు ప్లకార్డులు చేబూని సుమారు రెండు కిలోమీటర్ల మేర నిరసన ర్యాలీ నిర్వహించారు.

పోలీసుల అవాంతరాలు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులకు పోలీసులు అడుగడుగునా అవాంతరాలు సృష్టించారు. పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమై చీలురోడ్డు సెంటర్, రైల్వే ఓవర్‌బ్రిడ్జి సర్కిల్, కలెక్టర్ కార్యాలయం మెయిన్‌గేటు వరకు సాగిన ర్యాలీని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల అవాంతరాలను అధిగమించి రైతులు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్ అందుబాటులో లేరని, జేసీ మీటింగ్‌లో ఉన్నారంటూ కార్యాలయం సిబ్బంది చెప్పడంతో ఆగ్రహించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు అధికారులు వచ్చేంతవరకు ఇక్కడినుంచి కదిలేది లేదంటూ కలెక్టరేట్ ముందు బైఠాయించారు. రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. గంటపాటు ఆందోళన కొనసాగింది. ఎట్టకేలకు జేసీ ప్రఖర్ జైన్ ఆందోళనకారుల వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లా వెంకట్రావు, కె.అంజనీప్రసాద్‌రెడ్డి, గవిని శ్రీనివాసరావు, కోకి రాఘవరెడ్డి, దొంతిబోయిన సీతారామిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, కాగిత సుధీర్‌కుమార్, చిన్నపోతుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు

శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ వరుస వాయుగుండాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. నాటు వేసినప్పటి నుంచి ధాన్యం కొనుగోలు వరకు రైతులకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచిందని అన్నారు. సకాలంలో ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండి ఉపయోగం లేకపోవడంతో రైతులను దళారులు దోచుకుంటున్నారన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు.

బస్తాకు రూ.400 దోచుకుంటున్నారు

వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన్న హనిమిరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. 75 కిలోల బస్తాకు రైతులకు రూ.1725 చెల్లించాల్సి ఉండగా దళారులు రూ.1300 మాత్రమే చెల్లిస్తూ ఒక్కో బస్తాకు రూ.400 చొప్పున దోచుకుంటున్నారన్నారు. రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే పోలీసులతో అణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించగా నేడు రైతులను పట్టించుకున్న నాథుడే లేరన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా పనిచేస్తున్నాయని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారు. కూటమి సర్కార్ రైతులను నట్టేట ముంచింది. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు ప్రతి రైతుకు భరోసా కల్పించాలన్నారు.

రైతులను పట్టించుకోని చంద్రబాబు

వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడం బాధాకరం అన్నారు. రైతులకు గిట్టుబాటుధర కల్పించకపోవడంపై సమాధానం చెప్పాలని నిలదీశారు.

రైతులను నట్టేట ముంచిన కూటమి సర్కారు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున మాట్లాడుతూ కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. మేనిఫెస్టోలో అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని ఖరీఫ్ ముగిసి, రబీ సీజన్ వచ్చినప్పటికీ దాని ఊసే లేదని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి రైతుకూ ఏడాదికి రూ.13,500 చొప్పున క్రమం తప్పకుండా చెల్లించిందన్నారు. కూటమి పాలనలో రైతులు తమ సమస్యను నేరుగా అధికారులకు చెప్పుకునే వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పరిహారం కేవలం పచ్చనేతలకు మాత్రమే పంచుకున్న ఘనత కూటమి సర్కారుకే చెల్లిందన్నారు.



బాపట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు



జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్టీ నేతలు, రైతులు



రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

జర్నలిస్టులపై దాడికి నిరసన

కడప జిల్లా వేములలో జర్నలిస్టులపై దాడికి బాపట్ల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిరసన వ్యక్తమైంది. పలుచోట్ల జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. పర్చూరులో నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దాడికి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు
- అధికారులకు వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు



బాపట్లలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

బాపట్లటౌన్: మీడియా స్వేచ్ఛను హరించడం దారుణమని బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి ప్రశాంత్ అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా వేముల వద్ద శుక్రవారం జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల వార్త కవరేజ్‌కు వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల జర్నలిస్టులు ఉప్పాల శ్రీనివాసరావు, మురికిపూడి అంజయ్య, అంగిరేకుల కోటేశ్వరరావు, బొద్దుకూరి ధనరాజు, దాసు, వీరేసు, సుభానీ, శివ, రాము, రాజు పాల్గొన్నారు.

కొల్లూరు: జర్నలిస్టులపై అకారణంగా జరుగుతున్న దాడులపై నిరసన గళం పెల్లుబికింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మీడియా ప్రతినిధులపై జరుగుతున్న దాడులను శుక్రవారం కొల్లూరులో జర్నలిస్టులు ముక్తకంఠంతో నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం కడప జిల్లా వేములలో నీటి సంఘాల ఎన్నికల తంతును కవర్ చేసేందుకు వెళ్లిన 'సాక్షి' ప్రతినిధులు, కెమెరా మెన్‌లపై దాడి చేసి గాయపర్చడంతోపాటు, కెమెరాలు, సెల్‌ఫోన్‌లు ధ్వంసం చేయడం పాశవికమైన చర్య అని పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను పరిగణలోకి తీసుకొని దాడులు చేస్తున్న వ్యక్తులపై చట్టపరంగా కఠినమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. కొల్లూరు డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ మోహన్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి వడ్డే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పర్చూరు బొమ్మల సెంటర్ వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. బొమ్మల సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ అరుణకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు కే రవి, షేక్ అయూబ్, షేక్ రెహమాన్, వై శామ్యూల్, బీ నాగేశ్వరరావు, షేక్ బాషా, దళిత నాయకులు ఎన్ కిషోర్, సీపీఎం నాయకులు ఎం డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: కడప జిల్లాలో సాక్షి చానల్ రిపోర్టర్, మీడియా జర్నలిస్ట్‌పై కూటమి నేతలు దాడి చేయడాన్ని జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం డీటీకి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శివకృష్ణ, ఏ సోమాశ్రీనివాసరావు, రావుట్ల శ్రీనివాసరావు, ఎం గోపీ, నరిశెట్టి నాగేశ్వరరావు, వలేటి శ్రీనివాసరావు, రాఘవ, ఎండీ వలీ, తదితరులు ఉన్నారు.

రేపల్లె రూరల్: రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకర్లు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొడ్డు మణివరకుమార్, శీలం సోమయ్య (భరత్), నాగప్రసాద్, చింతల సురేష్, బడుగు నాగరాజు, పోలుబోయిన నాగబాబు, జాలాది అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల: చీరాల ప్రాంత జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో చీరాల ప్రాంత జర్నలిస్టులు నక్కల రమేష్ బాబు, మళ్లా చంద్రశేఖర్, షేక్ బాషా, ఎస్వీ కృష్ణారెడ్డి, కె.వాసుబాబు, బి.గురునాథం, పి.కృష్ణచైతన్య, పద్మా లోకేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభగా రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దార్, వేదికపై టీడీపీ నాయకులు

చీరాల టౌన్: రెవెన్యూ సదస్సుల్లో అధికారులు నాయకుల సేవల్లో తరిస్తున్నారు. శుక్రవారం తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఈపురుపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కేవలం రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే విభాగం, తదితర ప్రభుత్వ శాఖల అధికారులు మాత్రమే స్టేజీలపై ఉండాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈపురుపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాత్రం అందుకు విరుద్ధంగా టీడీపీ నాయకుల సభగా మారింది. సదస్సు నిర్వహిస్తున్న స్టేజీపై టీడీపీ నాయకులను కూర్చోబెట్టి ఉపన్యాసాలు కూడా చేయించారు. ప్రభుత్వ అధికారులు మాత్రమే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉండగా మాజీ జెడ్పీటీసీ జి.చంద్రమౌళి, పార్టీ నాయకులు జి.వెంకటేశ్వర్లు అధికార పార్టీ నేతలుగా దర్పాన్ని ప్రదర్శిస్తు ప్రసంగాలు చేయడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శించారు. టీడీపీ నాయకుల సభా లేక రెవెన్యూ సదస్సు జరిపించారా అనే సందేహాన్ని ప్రజలు వెలిబుచ్చారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులపై భౌతికదాడులు తగదు

రేపల్లె రూరల్: సమాజాభివృద్ధికి దోహదపడుతున్న ఉపాధ్యాయులపై భౌతికదాడులకు పాల్పడటం తగదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల కొల్లూరు మండలంలో ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రులు దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు. దాడుల వల్ల ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. ఉపాధ్యాయులు ఏమైనా తప్పులు చేస్తే సంబంధిత అధికారికి ఫిర్యాదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలేగాని దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఖండించిన వారిలో ఏపీటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.శేఖర్‌బాబు, పీడీ సోషలిజం, దోవా రవి, సిహెచ్ శ్రీనివాసరావు, తాతా శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులున్నారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: మహిళపై అత్యాచారానికి పాల్పడి, బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దిశ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు రోడ్డులోని ఓ ప్రాంతంలో బడ్డీ కొట్టు నిర్వహించే మహిళకు రెండు సంవత్సరాల క్రితం వెంగళాయపాలెంకు చెందిన దేవరకొండ నాగేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. మహిళను శారీరకంగా లొంగదీసుకున్న నాగేశ్వరరావు.. వీడియో చిత్రీకరించారు. దానిని చూపించి బెదిరిస్తూ బాధితురాలి నుంచి పలు దఫాలుగా డబ్బులు వసూలు చేశాడు. తరచూ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత మహిళకు వివాహమై ఇరువురు సంతానం ఉన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే భర్తతోపాటు బిడ్డలను చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ధనుర్మాస మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాల పోస్టర్‌ను మంగళగిరి పట్టణ వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పాత మంగళగిరి శ్రీకృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నందం జోగేంద్రచక్రవర్తి మాట్లాడుతూ శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు జరిగే ధనుర్మాస వ్రత మహోత్సవాలలో భాగంగా ఈ నెల 17వ తేదీన అమ్మవారికి సారె సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం జీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థ గోష్ఠి, సాయంత్రం స్వామివారి అనుగ్రహ భాషణ ఉంటాయని తెలిపారు. తరంగిణి ప్రతినిధులు విజయలక్ష్మి, డి.శ్రీహరిరావు పాల్గొన్నారు.

కక్కు కొడవళ్లకు కేరాఫ్ కొప్పెరపాడు

నాలుగు దశాబ్దాలుగా కొడవళ్ల తయారీ, అమ్మకాలు

- తూర్పుగోదావరి జిల్లా కడియం ప్రాంతం నుంచి వలస వచ్చిన కుటుంబం
- యంత్రాల రాకతో కొంతమేర తగ్గిన గిరాకీ
- ఆర్డర్లపై రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడులకు ఎగుమతులు
- సంవత్సరం పొడుగునా కార్ఖానాలో తయారీ



అమ్మకానికి సిద్ధం చేస్తున్న కొడవళ్లు

బల్లికురవ: కొడవలి వ్యవసాయానికి ఒక ప్రతీకలాంటిది. వ్యవసాయ రంగంలో కొడవలికి చాలా ప్రాధాన్యత ఉంది. అలాంటి కక్కు కొడవళ్ల తయారీలో కొప్పెరపాడు గ్రామానికి రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడులో ప్రత్యేక గుర్తింపు ఉంది. తూర్పుగోదావరి జిల్లా కడియం ప్రాంతం నుంచి వీరవల్లి సముద్రాచారి సుమారు నాలుగు దశాబ్దాల కిందట బతుకుదెరువు కోసం బల్లికురవ మండలం కొప్పరప్పాడుకు వలస వచ్చారు. నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారికి తూర్పుభాగంలో స్థలం కొనుగోలు చేసి నివాసం ఏర్పరచుకున్నారు. ఆరంభంలో వడ్రంగం పని చేశారు. ఈయనకు సత్యనారాయణ, పాపాచారి, వెంకట్రావు ముగ్గురు కుమారులు. ఈ ప్రాంతంలో ఆహార ధాన్యమైన వరి, కంది, జూట్, పశుగ్రాసం సాగు ఎక్కువగా ఉండటంతో కక్కు కొడవళ్లు తయారు చేయించి విక్రయించాలని సముద్రాచారి భావించారు. ముగ్గురు కుమారులకు కొడవళ్ల తయారీ నేర్పించారు.

తెనాలి నుంచి ముడిసరుకు దిగుమతి

కొడవళ్ల తయారీకి అవసరమైన ముడిసరుకు తెనాలి ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కొడవళ్లు హోల్‌సేల్, రిటైల్‌గా లోకల్‌లో అమ్మకాలు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు, కర్ణాటక, తమిళనాడు, ఆర్డర్లపై ఎగుమతి చేస్తున్నారు. ఆరంభంలో వీరి దగ్గర పని నేర్చుకున్న వారితో కలిపి ప్రస్తుతం గ్రామంలో 8 వరకు తయారీ కార్ఖానాలు ఉన్నాయి. ఒక్కో కార్ఖానాలో ముగ్గురు నుంచి నలుగురు కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు 180 నుంచి 200 వరకు కొడవళ్లు తయారు చేస్తున్నారు.

యంత్రాల రాకతో తగ్గిన గిరాకీ

పదేళ్ల కిందట వరకు ప్రతి రోజూ గిరాకీ ఉండేది. వరి, కంది, జూట్ కోతలకు యంత్రాలు రావటంతో కొంత గిరాకీ తగ్గింది. కొప్పెరపాడు కొడవలికి మంచి పేరు ఉండటంతో ఆర్డర్లు బానే వస్తున్నాయని వీరవల్లి సముద్రాచారి (చిన్న) వెంకటేశ్వర్లు, వెంకట్రావు, నాగప్రసాద్, గాలి శివాజీ, బాబి సాక్షి తెలిపారు. ఒక్కో కొడవలి రిటైల్‌గా రూ.100 నుంచి రూ.120. హోల్‌సేల్‌లో రూ.100లకు అమ్ముతున్నామని చెప్పారు.

కొడవలి తయారీతో స్థిరపడ్డాం..



మా తాత సముద్రాచారి ఈ ప్రాంతానికి వలస వచ్చాడు. నా తండ్రి పాపాచారి కొడవలి తయారీ పనిని తనకు నేర్పటంతో జీవనానికి ఇబ్బంది లేదు. సంవత్సరం పొడవునా రైతులు, వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొంటూనే ఉన్నారు.
– వీరవల్లి సముద్రాచారి (చిన్న)

కొప్పెరపాడు కొడవలికి పేరు..



కొప్పెరపాడులో తయారయ్యే కొడవలికి మంచి పేరు ఉంది. నాణ్యతతోపాటు కక్కు కోస్తే సంవత్సరం పొడుగునా ఉపయోగపడుతుంది. పశువుల మేత, వరి, కంది కోతలకు కొడవళ్లు బాగున్నాయి.
– పి శ్రీను, అద్దంకి

ధర కూడా అందుబాటులో..



కొప్పెరపాడులో తయారయ్యే కొడవళ్ల ధర అందుబాటులో ఉంటున్నాయి. పిడిలో పట్టుతోపాటు నాణ్యతలో రాజీలేకుండా తయారు చేస్తున్నారు. అవసరమైనప్పుడు ఇక్కడికి వచ్చి కొనుక్కొని వెళ్తున్నాను.
– సునీల్, పెట్లూరివారిపాలెం,

ఫెర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ప్రత్తిపాడులోని దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ డి.సూర్యశ్రావణ్‌కుమార్

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ డి.సూర్య శ్రావణ్ కుమార్‌తోపాటు సీఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, విజిలెన్స్ ఏవో ఆదినారాయణల బృందం స్థానిక ఏవో కె.అరుణకుమారితో కలిసి మంజునాథ ట్రేడర్స్, పయనీర్ ఆగ్రోస్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేసింది. రికార్డులు, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లును పరిశీలించారు. ఎస్పీ స్వయంగా గోడౌన్లకు వెళ్లి తనిఖీ చేశారు. స్టాకు వ్యత్యాసం ఉండటాన్ని గమనించారు. దీంతో మంజునాథ ట్రేడర్స్‌లో రూ.2,02,348 విలువ చేసే 11.36 మెట్రిక్ టన్నుల ఎరువులు, పయనీర్ ఆగ్రోస్‌లో రూ.1,96,300 విలువ చేసే 11.5 మెట్రిక్ టన్నుల ఫెర్టిలైజర్స్‌ను సీజ్ చేసినట్లు వ్యవసాయాధికారి అరుణకుమారి తెలిపారు. ఈ మేరకు ఆయా దుకాణాల నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

మంద కృష్ణకు మతిభ్రమించింది

- 15న మహాగర్జనలో మాలలు సత్తా చాటాలి
- ఏజీ జేఏసీ కన్వీనర్ అన్నవరపు కిషోర్

తెనాలి: తెలంగాణ మాల సింహ గర్జన చూసి మందకృష్ణకు మతిభ్రమించిందని, ఏడో తరగతి చదివిన మందకృష్ణ.. మాల మేధావులను చర్చలకు పిలవడం హాస్యాస్పదమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, అఖిలభారత మాల సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ వ్యాఖ్యానించారు. ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల మహాగర్జన సభను జయప్రదం చేయాలని కోరుతూ జనసమీకరణలో భాగంగా శుక్రవారం ఆయన తెనాలి వచ్చారు. స్థానిక అయితానగర్‌లోని మాలల మహా గర్జన జేఏసీ కార్యాలయంలో 'హలో మాల–చలో గుంటూరు' కరపత్రాన్ని ఆవిష్కరించారు. అక్కడే విలేకరులతో మాట్లాడుతూ, వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటిన సూచనలు మాత్రమే చేసిందని గుర్తుచేశారు. దీనిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం దీనిపై కమిషన్ నియామకాన్ని కూడా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. రిజర్వేషన్ ఫలాలను మాలలు అనుభవిస్తూ దోచుకుతింటున్నారని 30 ఏళ్ల నుంచి మందకృష్ణ నమ్మిస్తూ విష ప్రచారంతో పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా గలిగిన మాలలు ఈ నెల 15వ తేదీన గుంటూరులో జరిగే మహా గర్జన సభలో తమ సత్తా చాటుతారని అన్నారు. జేఏసీ నాయకుడు యండ్రపాటి అశోక్ కుమార్, జేఏసీ మాల నాయకుడు బండికళ్ల బుల్లయ్య , బి.ప్రదీప్, డాక్టర్ కారుమంచి రవికుమార్, కంచర్ల కోటేశ్వరరావు, కె. సునీల్, జ్యోతుల బాబి, పిల్లి ప్రేమ్‌కుమార్, కొల్లూరి కిరణ్, పిల్లి తిమోతి, గడ్డేటి సుందర సునీల్, పిల్లి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు,



కరపత్రాన్ని ఆవిష్కరించిన అన్నవరపు కిషోర్

పులకించిన భక్తజనం

- దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి
- నూతన వధూవరులు, యాత్రికుల తాకిడి
- అర్జిత సేవలకు డిమాండ్



అమ్మవారిని దర్శించుకుంటున్న భవానీలు, భక్తులు



ఇంద్రకీలాద్రిపై క్యూలైన్‌లో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ భక్తజనానికి దర్శన భాగ్యం కల్పించింది. అమ్మ దర్శనంతో శుక్రవారం భక్తుల మది పులకించింది. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దర్శనానికి భక్తులు, నూతన వధూవరులు, యాత్రికుల తాకిడి పెరిగింది. సుముహూర్తాలతో ఒక్కటైన నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులతో పాటు శుక్రవారం భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకుంది. ఆది దంపతులకు నిర్వహించిన అర్జిత సేవల్లో ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి. భవానీలు, అయ్యప్పలు, శివ దీక్షధారణ చేసిన వారితో పాటు యాత్రలు చేసిన వారు ఇంద్రకీలాద్రికి తరలి వచ్చారు. పవిత్ర కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేసిన ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్నారు. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ క్యూలైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో రద్దీ పెరగడంతో క్యూలైన్‌లో త్వరితగతిన ముందుకు కదిలిలా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

రాజస్థాన్, ఉత్తరాఖండ్ మ్యాచ్ డ్రా

మంగళగిరి: విజయ్ మర్చంట్ ట్రోఫీ అండర్ –16లో రాజస్థాన్, ఉత్తరాఖండ్ మధ్య క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 82.1 ఓవర్లలో 266 పరుగులు చేసి ఆలౌటైంది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ యశ్వంత్ భరధ్వాజ్ 50 పరుగులు సాధించగా, షైఫన్ ఖాన్ 48 పరుగులు చేశాడు. ఉత్తరాఖండ్ బౌలర్లు నియాన్ త్యాగి, మెహ్మద్ షాహిద్‌లు చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 102.5 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. ఉత్తరాఖండ్ బ్యాట్స్‌మెన్‌లు అభిమన్యు 75 , అనయనేగి 71, కుషేగ్ర జెడ్ 54 పరుగులు సాధించారు. రాజస్థాన్ బౌలర్లు మిరాన్ ఖాన్, సుజాల్ ఫర్మార్ 3 వికెట్ల చొప్పున తీశారు. రాజస్థాన్ రెండవ ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 243 పరుగులు సాధించింది. రజత్ బాగెల్ 86, రాహుల్ 81, సైఫన్ ఖాన్ 51 పరుగులు సాధించారు. దీంతో మ్యాచ్ డ్రా అయింది. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించడంతో మూడు పాయింట్లు సాధించింది. రాజస్థాన్ ఒక పాయింట్ పొందింది.



రజత్ బాగెల్ (87 పరుగులు)



రాహుల్ (21 పరుగులు)



మొహ్మద్ షాహిద్

ఐఏఎల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో న్యాయవాదులు

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా సమితి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.నరసింహారావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పర్చూరు నంద, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్దా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ సీనియర్ ఈఎం ఎస్‌బీఏ ఝాన్సీ, మాజీ అధ్యక్షులు కేవీకే సురేష్, సభ్యులు కె.నరసింహం, వేముల జయపాల్, కె.అంబిక, వి.లక్ష్మీతిరుపతమ్మ, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం టేబుల్, పాకెట్ క్యాలెండర్లను న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు అందజేశారు. కోర్టుకు సంబంధించిన సెలవు దినాలతో ముద్రించిన క్యాలెండర్ అందరికీ ఉపయుక్తంగా ఉందని వక్తలు తెలిపారు.

ఫారెస్ట్రీ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు

రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం

ఏఎన్‌యూ: ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ కోర్సు చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం అన్నారు. యూనివర్సిటీ వృక్ష శాస్త్రం, ఫారెస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం హెర్బల్ గార్డెన్‌లో షెడ్ నెట్, పాలీహౌస్‌లను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఫారెస్ట్రీ కోర్సు నడుపుతున్న ఏకైక విశ్వవిద్యాలయం తమదేనన్నారు. విద్యార్థులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే చూడకుండా స్వయంగా స్టార్టప్‌లు ఏర్పాటు చేసి అనేక మందికి ఉపాధి కల్పించాలని సూచించారు. విశిష్ట అతిథిగా ఐఎఫ్ఎస్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ.. పెరిగిపోతున్న కాలుష్యం వలన భూతాపం పెరిగి వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి కాప్ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టులో ఏపీ బయోడైవర్సిటీ బోర్డు జీవవైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంఎస్సీ ఫారెస్ట్రీ విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున మాట్లాడుతూ ఏపీ ఫారెస్ట్రీ విభాగంతో సంయుక్తంగా ఈ కోర్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ అమృతవల్లి, డాక్టర్ మాధవి, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ పీఎస్ రాజు, పలువురు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేస్తాం



నరసరావుపేట: స్థానిక ప్రభుత్వ వైద్యశాల పూర్తిస్థాయిలో పనిచేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రూ.2.5కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్, పది బెడ్ల ఐసీయూను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి మాట్లాడుతూ రెడ్ క్రాస్ ప్రతినిధులు, దాతల సహకారం, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ సహకారంతో ఆధునాతన సదుపాయాలతో బ్లడ్‌సెంటర్ ఏర్పాటుచేయటం అభినందనీయమని తెలిపారు. పల్నాడు జిల్లాతోపాటు చుట్టుపక్కల ఉన్న ప్రాంతవాసులకు బ్లడ్‌సెంటర్ వరం లాంటిదని పేర్కొన్నారు. జాతీయ రహదారులు దగ్గరగా ఉన్నందు వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయని, బాధితులకు రక్తం అవసరం ఎంతైనా ఉంటుందని తెలిపారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులకు కరెంట్ బిల్లు విషయంలో సబ్సిడీని అందించేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు కష్టపడి విరాళాలు సేకరించి నిర్మాణం పూర్తి చేశారని తెలిపారు. ఆర్డీవో కార్యాలయ కాంపౌండ్‌లో ఉన్న స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం బ్లడ్ సెంటర్ నిర్మాణానికి విరాళాలు అందించిన సూర్యప్రభ, మెదరమెట్ల రామశేషగిరిరావు, డాక్టర్ వివేకానందరెడ్డి, బుచ్చయ్య చౌదరి, పాలడుగు పుల్లారావు, జీవీఎస్ రాము, అమరా రాంబాబులను మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే చదలవాడ సన్మానించారు. కార్యక్రమంలో దరిశి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డీఆర్వో ఏ.మురళి, జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ జిల్లా అధ్యక్షుడు బందగీ సాహెబ్



నరసరావుపేట: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సీఐటీయూ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిసి వినతి పత్రం అందజేశారు. బందగీ సాహెబ్ మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో 23 అటెండర్ పోస్టులు,11 నైట్ వాచ్‌మేన్ పోస్టులు, గురజాల డివిజన్ పరిధిలో 21 అటెండర్ పోస్టులు, ఏడు నైట్ వాచ్‌మేన్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఏళ్ల తరబడి వాటిని భర్తీ చేయకపోవడంతో వీఆర్ఏలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆయా పరిధిలోని ఆర్డీవోలు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీచేయాలని డిమాండ్ చేశారు. అటెండర్, నైట్ వాచ్‌మేన్ పోస్టుల భర్తీకి కృషి చేస్తానని, దీనిపై సంబంధిత ఆర్డీవోలకు సర్క్యులర్ జారీ చేస్తానని జేసీ హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం డీఆర్వో మురళిని కలిసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట మండల అధ్యక్షుడు రోశయ్య, కోశాధికారి సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి రఫీ, నకరికల్లు మండల అధ్యక్షుడు కాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి, మండల ప్రధాన కార్యదర్శి మునాఫ్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కరెంటు బిల్లుల దహనం



బిల్లులను తగలబెడుతున్న సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: పెంచిన కరెంటు చార్జీలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో శుక్రవారం బిల్లులను దహనం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లుల పెంపుదల చేయమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ప్రజలపై యూజర్ చార్జీల పేరుతో భారాలు మోపుతోందని విమర్శించారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలు వెనక్కి తీసుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణ బిల్లును కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ బాబు, గుదే బిక్షాలు, జి.నాగేశ్వరరావు, కొమ్ము పుల్లయ్య, కనకారావు, షేక్ మాబు, హసాన్‌వలి, మురికిపూడి చిన్న, ధీరు నాయక్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.